దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం! గమనం!!

## బీఆర్ఎస్ పాలనలో అధికారం ఒక వ్యక్తి, ఒక కుటుంబం చేతుల్లోనే

తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తి చేసుకోవడం రాష్ట్ర ప్రస్థానంలో ఒక ముఖ్యమైన మైలురాయి అని, ఈ వెయ్యి రోజుల్లో కేవలం ప్రభుత్వం మాత్రమే మారలేదు తెలంగాణ ప్రజలు పోరాడి సాధించుకున్న ప్రజాస్వామ్య స్ఫూర్తి పునరుద్ధరణ జరిగిందని రాష్ట్ర మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అధికారం ఒక వ్యక్తి, ఒక కుటుంబం చేతుల్లో కేంద్రీకృతమైందని, మంత్రులు, శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు, ప్రతిపక్షాలు, చివరకు సామాన్య ప్రజల గొంతుకకు కూడా విలువ లేకుండా పోయిందని ఆయన ఆరోపించారు. సచివాలయం ప్రజలకు అందుబాటులో లేకుండా చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనపరిచి, ప్రశ్నించే వారిని శత్రువులుగా చూశారని ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ నిరంకుశ సంస్కృతికి ముగింపు పలికిందని, తమ ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉంది.. మంత్రులు ప్రజల మధ్యకు వెళ్తున్నారు..శాసనసభలో ప్రజా సమస్యలపై చర్చలు జరుగుతున్నాయని మంత్రి ఉత్తమ్ తెలిపారు. ప్రజలు నిర్భయంగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారని, ప్రజావాణి, గ్రామసభలు, ప్రత్యక్ష ప్రజా సంప్రదింపుల ద్వారా పాలనను ప్రజల ముంగిటకు తీసుకువచ్చామని ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు.

సంపుటి: 3 | సంచిక : 235 | సోమవారం 31. 8. 2026 | ఎడిటర్ వేముల అయోధ్య రాములు | పేజీలు 4 | వెల: 5.00



# 267 మందితో వెళ్తున్న ఫెర్రీ బోల్తా

02

## 100 మందిని రక్షించిన రెస్క్యూ టీం

## ప్రధాని మోడీకి ఉజ్బెకిస్తాన్ అత్యున్నత పురస్కారం



తొలి సమయం హైదరాబాద్

ప్రధాన మంత్రి మోడీ ఆదివారం నాడు ఉజ్బెకిస్తాన్ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయేవ్ చేతుల మీదుగా ఆ దేశ అత్యున్నత పురస్కారమైన 'ఒలి దరాజలి దుస్తిక్' ను స్వీకరించారు. వివరాలు 2లో

## హాకీ ప్రపంచకప్ విజేత అర్జెంటీనా

తొలి సమయం హైదరాబాద్




మహిళల హాకీ ప్రపంచకప్‌ను అర్జెంటీనా కైవసం చేసుకుంది. నిన్న ఆమ్‌స్టెల్‌వీన్‌లో జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్ పోరులో, షూటౌట్‌లో 3–1 తేడాతో ఆతిథ్య నెదర్లాండ్స్‌ను ఓడించి ఛాంపియన్‌గా అవతరించింది. నిర్ణీత సమయం ముగిసేసరికి ఇరు జట్లు 1–1తో సమంగా నిలవడంతో విజేతను నిర్ణయించేందుకు షూటౌట్ నిర్వహించాల్సి వచ్చింది. ఆట 30వ నిమిషంలో యిబీ జాన్సన్ గోల్ చేయడంతో నెదర్లాండ్స్ ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అయితే, ద్వితీయార్థంలో పుంజుకున్న అర్జెంటీనా 54వ నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను సద్వినియోగం చేసుకుంది. మారియో గ్రానాటో అద్భుతమైన గోల్‌తో స్కోరును సమం చేయడంతో మ్యాచ్ షూటౌట్‌కు దారితీసింది. షూటౌట్‌లో అర్జెంటీనా క్రీడాకారిణులు పూర్తి ఆధిపత్యం ప్రదర్శించారు. ఆ జట్టు తరపున విక్టోరియా గ్రానాటో, బ్రిసా, సోఫియా కైరో గోల్స్ సాధించగా, నెదర్లాండ్స్ జట్టులో మారీన్ మాత్రమే లక్ష్యాన్ని చేర గలిగింది. దీంతో అర్జెంటీనా విజయం ఖాయమైంది. అర్జెంటీనాకు ఇది మూడో ప్రపంచకప్ టైటిల్ కావడం విశేషం.

### కాబోయే ప్రధాని విజయ్ అంటూ జోరుగా ప్రచారం..

# అధికార కూటిమిలో కలకలం..!

తొలి సమయం హైదరాబాద్



తమిళనాడు లో అధికారంలో ఉన్న 'తమిళగ వెట్రి కళగం , దాని మిత్రపక్షం కాంగ్రెస్ మధ్య రాజకీయ విభేదాలు బహిర్గతమవుతున్నాయి. ముఖ్యమంత్రి సి జోసెఫ్ విజయ్ ని దేశానికి కాబోయే ప్రధానిగా కీర్తిస్తూ కొందరు టీవీకే నేతలు మద్దతుదారులు చేస్తున్న ప్రచారం కూటమిలో తీవ్ర కలకలం రేపుతున్నది. ఈ పరిణామంపై కాంగ్రెస్ అధిష్ఠానం తీవ్ర అసంతృప్తితో ఉన్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. విజయ్‌ని ప్రధానిగా ప్రాజెక్ట్ చేస్తూ సాగుతున్న ఈ ప్రచారం వెనుక పార్టీ నాయకత్వాన్ని ఆకట్టుకోవాలనుకునే కొందరు టీవీకే నేతల ప్రయత్నం ఉన్నప్పటికీ.. ఇది కూటమి జాతీయ రాజకీయ వైఖరిపై గందరగోళం సృష్టిస్తుందని కాంగ్రెస్ నేతలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. తొలుత అసెంబ్లీలో మంత్రులు, ఎమ్మెల్యేలు విజయ్‌పై ప్రశంసలకే పరిమితమయ్యారు. కానీ ఇప్పుడు బహిరంగ ప్రదేశాల్లో పోస్టర్లు, ఉత్తర భారతదేశంలో ప్రచార వీడియోల రూపంలోకి విస్తరించింది. ఇది బీజేపీకి ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్‌కు ఇబ్బందికరంగా మారింది. ఇటీవల ఓ టెలివిజన్ ఛానల్ నిర్వహించిన సర్వే ఈ వివాదానికి మరింత ఆజ్యం పోసింది. వివరాలు 2లో



## జెండాను కాలితో తన్నుతూ ఖలిస్థానీల కండకావరం.. కేంద్రమంత్రి వార్నింగ్

- న్యూయార్క్‌లో ఖలిస్థానీ మద్దతుదారుల దుశ్చర్య
- భారత జాతీయ పతాకాన్ని కాలితో తొక్కిన ఆందోళనకారులు
- ఘటనపై తీవ్రంగా స్పందించిన కేంద్రమంత్రి కిరణ్ రిజిజు
- దేశాన్ని, జెండాను అవమానిస్తే సహించేది లేదని స్ట్రాంగ్ వార్నింగ్
- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలు

02



## రేవంత్ సర్కార్ రియల్ ఎస్టేట్ ఏజెన్సీగా మారిపోయింది: హరీష్‌రావు

తొలి సమయం హైదరాబాద్

ప్రభుత్వ భూములను ప్రయివేట్ వ్యక్తులకు ధారాదత్తం చేయడం ఆపాలంటూ సీఎం రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు లేఖ రాశారు. హైదరాబాద్ లోని ఆజామాబాద్‌లో రూ.500 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని కొందరు ప్రయివేట్ వ్యక్తులకు కేవలం రూ.87 కోట్లకే కట్టబెడుతున్నారని ఆరోపించారు. రూ.87 కోట్లు చెల్లించేందుకు ప్రభుత్వ సంస్థ ఆయిల్‌ఫెడ్ సిద్ధంగా ఉన్నప్పటికీ.. ప్రయివేట్ వ్యక్తులకే ఇస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. రేవంత్ సర్కారు రియల్ ఎస్టేట్ ఏజెన్సీగా మారిపోయిందని విమర్శించారు.

## కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి.. అసలు విషయం చెప్పిన మహేశ్ గౌడ్

- కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి హామీ ఇచ్చింది వాస్తవమేనన్న టీపీసీసీ చీఫ్
- రాజకీయ సమీకరణాల వల్లే పదవి ఇవ్వడంలో ఆలస్యం జరిగిందని వెల్లడి
- సెప్టెంబర్ నాటికి పార్టీలోని అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని ధీమా
- అసంతృప్తులు, నామినేటెడ్ పదవుల భర్తీపై వచ్చే నెలలో స్పష్టత
- కాంగ్రెస్ ఒక మహాసముద్రమని, అభిప్రాయాలు చెప్పే స్వేచ్ఛ ఉంటుందని వ్యాఖ్య



02




## నేపాల్ వరదలు... 788 మృతదేహాలు వెలికితీత

02

## ఏఐ టెక్నాలజీతో జెండా వందనం

కరీంనగర్ బాల మేధావికి ఈటల అభినందనలు

- కరీంనగర్ జిల్లా బాలుడి అద్భుత ఆవిష్కరణ
- ఏఐ, మొబైల్ ఆధారిత ఫ్లాగ్ హోస్టింగ్ సిస్టమ్ రూపకల్పన
- 13 ఏళ్ల శ్రీ సృష్టి సాయిని ప్రశంసించిన ఎంపీ ఈటల రాజేందర్
- ప్రధాని మోదీ వల్లే దేశంలో డిజిటల్ విప్లవం సాధ్యమైందన్న ఈటల
- విద్యార్థులు ఏఐ, కోడింగ్ నైపుణ్యాలు నేర్చుకోవాలని పిలుపు

02



## దంతాలపల్లిలో ఘనంగా జరిగిన పీఏసీఎస్ చైర్మన్ కుమారుడి వివాహం

- నూతన వధూవరులను ఆశీర్వదించిన మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్
- దోర్నకల్ నియోజకవర్గ కాంగ్రెస్ యువజన నాయకులు నూకల అభినవ్ రెడ్డి



**తొలి సమయం - దంతాలపల్లి, ఆగస్టు 30:**
మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలంలో ఆదివారం జరిగిన ఓ వివాహ వేడుక రాజకీయ ప్రముఖుల సమక్షంతో సందడిగా మారింది. మండలంలోని దాట్ల గ్రామానికి చెందిన ఉమ్మడి నరసింహులపేట పీఏసీఎస్ చైర్మన్ సంపేట రాము గౌడ్ కుమారుడు శ్రీపాల్ గౌడ్ – శ్రీదివ్యల వివాహ మహోత్సవం దంతాలపల్లి కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర ఫంక్షన్ హాల్ లో వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, దోర్నకల్ నియోజకవర్గ కాంగ్రెస్ యువజన నాయకులు నూకల అభినవ్ రెడ్డి విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం వారు మాట్లాడుతూ నూతన దంపతులు నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలం రవీందర్ రెడ్డి, మెరుగు సత్యనారాయణ, మెంచు అశోక్, కొడుపుగంటి హరికృష్ణ, మార్త శ్రీనివాస్, కారుపోతుల రాము గౌడ్, సేను రాజేష్, రామ్ లాల్ తో పాటు పీఏసీఎస్ సభ్యులు, గ్రామ పెద్దలు, బంధుమిత్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ హామీని అమలు చేయాలి

**తొలి సమయం; కేసముద్రం/ (మహబూబాబాద్), ఆగస్టు 30:**



బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీని ఏర్పాటు చేయడంలో కేంద్రంలోని బీజేపీ,రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఎంసీపీఐ(సీ) రాష్ట్ర కమిటీ సభ్యుడు మరిపెల్లి మొగిలి ఆరోపించారు.కేసముద్రంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల ముందు బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్, బీజేపీలు హామీలు ఇచ్చాయని,అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించాయని విమర్శించారు.బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటైతే వేలాది మందికి ప్రత్యక్షంగా,పరోక్షంగా ఉద్యోగ,ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు.స్థానికంగా లభించే ఇనుప ఖనిజాన్ని సద్వినియోగం చేసుకోవడంతో పాటు ఈ ప్రాంతంలో పారిశ్రామిక అభివృద్ధికి బాటలు పడతాయని తెలిపారు.పరిశ్రమకు అనుబంధంగా చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఏర్పడి మరిన్ని ఉపాధి అవకాశాలు కలుగుతాయని పేర్కొన్నారు.ఉపాధి కోసం యువత ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి తగ్గుతుందన్నారు.కేంద్ర ప్రభుత్వం ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ప్రకటించినప్పటికీ,అధికారంలోకి వచ్చిన తర్వాత ఉన్న ఉద్యోగాలను తొలగిస్తోందని విమర్శించారు.కార్మిక చట్టాలను తొలగిస్తూ వాటిని నాలుగు లేబర్ కోడ్‌లుగా విభజించడం ద్వారా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను హరించి వేస్తోందని ఆరోపించారు.కార్మికుల హక్కులను కాపాడేందుకు కార్మిక సంఘాలు, ప్రజలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ అంశంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పరం నిందలు వేసుకోవడం మానుకొని స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీ ఏర్పాటుకు అవసరమైన నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని,స్థానిక యువతకు నైపుణ్య శిక్షణతో పాటు ఉద్యోగాల్లో ప్రాధాన్యత కల్పించాలని కోరారు.బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ కోసం ప్రజా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని,ప్రజలు,యువత పెద్ద సంఖ్యలో ఉద్యమంలో భాగస్వాములు కావాలని మొగిలి పిలుపునిచ్చారు.

## ఏ.ఐ.కె.ఎమ్. ఎస్. రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి.



**ొలి సమయం, కొమరారాం; ఆగస్టు, 30:**
మంచిర్యాలలో సెప్టెంబర్ 8, 9 తేదీల్లో నిర్వహించనున్న అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏ. ఐ. కె. ఎం. ఎస్) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సంఘం నాయకులు పిలుపనిచ్చారు. ఈ సందర్భంగా ఇల్లందు మండలం కొమరారంలో మూడు మాలు అధ్యక్షతన ఏ. ఐ. కె .ఎమ్. ఎస్ . మండల కార్యవర్గ సమావేశం నిర్వహించి మహాసభల గోడపత్రికను ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఏనుగు చంద్రారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు తుపాకుల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆదివాసీల చట్టబద్ధ, సాంప్రదాయ హక్కులను కాపాడాలని, 1/70 చట్టాన్ని సవరించే ప్రయత్నాలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా ఇల్లందు, గుండాల, బయ్యారం ప్రాంతాలకు సాగునీరు అందించాలని, యాప్ విధానంలో యూరియా పంపిణీని రద్దు చేయాలని, ఇల్లందు రైల్వే లైన్‌ను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహాసభలకు ఇల్లందు మండలం నుంచి 15 మంది ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో ఏ. ఐ. కె .ఎమ్. ఎస్. మండల అధ్యక్షుడు గోగ్గేలా రాజు, బానోత్ సంతు, వాంకుడోతు శ్రీను, చింత భాస్కర్, చిన్నస్వామి, వెంకటేశ్వర్లు, లింబ్య, గణపరపు వెంకట నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ వెయ్యిరోజుల పాలనపై బీఆర్ఎస్ పోరుబాట.




**తొలి సమయం, ఇల్లందు;ఆగస్టు, 30:**
ఇల్లందు, కేటీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యిరోజుల పాలనలో ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాలను ఎండగడుతూ సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు చేపట్టనున్న కార్యక్రమాల విజయవంతానికి బీఆర్ఎస్ నాయకులు సన్నాహక సమావేశం నిర్వహించారు. దిండిగాల రాజేందర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో బీఆర్ఎస్ ఫౌండర్ మెంబర్ దిండిగాల రాజేందర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించే కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ఎస్.రంగనాథ్, ఎండీ జబ్బార్, పరికపల్లి రవి గౌడ్, ఎస్కే అబ్దుల్ నబీ, కుంజా సుగుణయ్య, నారపాక వసంతరావు, ఊకే లక్ష్మీనారాయణ, రాచపల్లి శ్రీను, మునిగంటి శివ తదితరులు పాల్గొన్నారు.

# బీర్ శెట్టి గూడెం సంతకు మహర్దశ!

- వార్డు మెంబర్ సేవకు గ్రామస్తుల ఫిదా
- ప్రజా సేవలో ఆదర్శంగా నిలుస్తున్న యువ నాయకుడు
- సొంత ఖర్చులతో డోజర్ తో సంత ప్రాంగణం క్లీన్





**తొలి సమయం - దంతాలపల్లి,ఆగస్టు 30:**
దంతాలపల్లి మండలంలోని బీర్ శెట్టి గూడెం గ్రామంలో ఒక యువ వార్డు సభ్యుడు చేసిన సేవా కార్యక్రమం ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. గ్రామంలో ప్రతి శుక్రవారం వారపు సంత ఎంతో సందడిగా జరుగుతుంది. చుట్టుపక్కల గ్రామాల నుంచి వందలాది మంది రైతులు, చిరు వ్యాపారులు, ప్రజలు ఈ సంతకు వస్తుంటారు. అయితే గత కొంతకాలంగా సంత జరిగే ప్రదేశంలో గడ్డి, పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు విపరీతంగా పెరిగిపోవడంతో సంతకు వచ్చే వారికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ విషయాన్ని గమనించిన మొదటి వార్డు మెంబర్ నెలకుర్తి శృతి శ్రీకాంత్ రెడ్డి వెంటనే స్పందించారు. ఎవరి సహాయం కోసం ఎదురు చూడకుండా తన సొంత ఖర్చులతో డోజర్ (ట్రాక్టర్) ను రప్పించి సంత ప్రాంగణం మొత్తాన్ని శుభ్రం చేయించారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి, రోడ్డును చదును చేయించారు. డోజర్ తో శుభ్రం కాని ప్రదేశాల్లో కలుపు మందును స్ప్రే చేయించి పూర్తిస్థాయిలో పరిశుభ్రం చేసేందుకు చర్యలు చేపట్టారు. ప్రయాణికులకు, చిరు వ్యాపారులకు, గ్రామస్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతోనే ఈ పరిశుభ్రత కార్యక్రమం చేపట్టాను. గ్రామ అభివృద్ధే నా లక్ష్యం అని వార్డు మెంబర్ శ్రీకాంత్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. యువ నాయకుడు చేసిన ఈ సేవా కార్యక్రమంపై గ్రామస్తులు, చిరు వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రతినిధి అంటే ఇలా ఉండాలని, తన వార్డు పట్ల బాధ్యతగా వ్యవహరిస్తున్న శ్రీకాంత్ రెడ్డిని పలువురు అభినందిస్తున్నారు.

## మెగా హెల్త్ క్యాంపులో పాల్గొన్న ది గాడ్ థెరిస్సా మహిళా మండలి సిబ్బంది







**తొలి సమయం, ఇల్లందు;ఆగస్టు, 30:**
ఇల్లందు: ఇల్లందు యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా హెల్త్ క్యాంపులో ది గాడ్ థెరిస్సా మహిళా మండలి సిబ్బంది పాల్గొని ప్రజలకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. వివిధ విభాగాలకు చెందిన వైద్యులు క్యాంపులో పాల్గొని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన మందులను అందజేశారు. ఈ సందర్భంగా ది గాడ్ థెరిస్సా మహిళా మండలి సిబ్బంది ప్రజలకు హెచ్ఐవీ, సిఫిలిస్, హెపటైటిస్-బి, హెపటైటిస్-సి తదితర రక్త పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో పాజిటివ్‌గా నిర్ధారణ అయిన వారిని తదుపరి వైద్య సేవల కోసం ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు. అలాగే నాకో (చీూజా) ప్రవేశపెట్టిన సెల్ఫ్ రిస్క్ అసెస్‌మెంట్ క్యూఆర్ కోడ్‌పై ప్రజలకు అవగాహన కల్పించి, దాన్ని స్కాన్ చేసుకునేలా ప్రోత్సహించారు. క్యాంపును ఇల్లందు డీఎస్పీ, సీఐ, మున్సిపల్ చైర్మన్ దొడ్డా కిరణ్ మిత్ర డేనియల్ తదితరులు సందర్శించారు. కార్యక్రమంలో ఇల్లందు యూత్ సభ్యులతో పాటు ది గాడ్ తెరెస్సా మహిళా మండలి ప్రాజెక్ట్ మేనేజర్ మైపా వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం పట్ల పలువురు అభినందించారు.

## ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన దుబాకుల శ్రీనివాస్ యాదవ్





**తొలి సమయం, గార్ల;ఆగస్టు, 30:**
గార్ల, 30 సంవత్సరాల పాటు క్రమశిక్షణతో ఉపాధ్యాయుడిగా సేవలందిస్తూ వృత్తికి వన్నె తెచ్చిన దుబాకుల శ్రీనివాస్ యాదవ్ సేవలు అభినందనీయమని డీసీసీబీ డైరెక్టర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు మేకల మల్లిబాబు యాదవ్, కామేపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు గుజ్జర్లపూడి రాంబాబు, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి షేక్ పతే మహమ్మద్, తోటకూరి శివయ్య అన్నారు.ఆదివారం గార్లలో దుబాకుల శ్రీనివాస్ యాదవ్ పదవీ విరమణ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మేకల మల్లిబాబు యాదవ్ మాట్లాడుతూ.. శ్రీనివాస్ యాదవ్ తనకు వ్యక్తిగతంగా ఎంతో ముఖ్యమైన వ్యక్తి అని తెలిపారు. ఉపాధ్యాయ వృత్తిలోకి రాకముందు అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు గ్రామాల్లో పర్యటించి గొర్రెల సంఘాల ఏర్పాటుకు కృషి చేశారని గుర్తుచేశారు. గతంలో డీసీసీబీ డైరెక్టర్‌గా కూడా సేవలందించారని, ఉన్నతమైన వ్యక్తిత్వం కలిగి శత్రువులు లేని వ్యక్తిగా పేరు సంపాదించుకున్నారని కొనియాడారు. ఉపాధ్యాయ వృత్తి నుంచి పదవీ విరమణ చేసినప్పటికీ సామాజిక సేవా కార్యక్రమాలకు ఆయన విశ్రాంతి ఉండదని, ఇకపై పాత్ర మాత్రమే మారుతుందని అన్నారు. ఆయన భవిష్యత్ జీవితం ఆయురారోగ్యాలతో సంతోషంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా దుబాకుల శ్రీనివాస్ యాదవ్--సుభాషిణి దంపతులను పుష్పగుచ్ఛం, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చిత్తారు సింహాద్రి యాదవ్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ దుబాకుల వెంకటేశ్వర్లు, లోడిగ వెంకన్న, ఉపసర్పంచ్ మేకల మల్లికార్జునరావు, శీలం పుల్లయ్య, చంద్రకాని గట్టయ్య, డాక్టర్ చంద్రకాని గురు, ఉపాధ్యాయ సంఘాల రాష్ట్ర, జిల్లా నాయకులు, బంధువులు, మిత్రులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

## సుభాష్‌నగర్‌లో ఘనంగా శ్రీలక్ష్మి భూలక్ష్మి, ముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ.



**తొలి సమయం, ఇల్లందు;ఆగస్టు, 30:**
ఇల్లందు మండలం సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ పరిధిలో శ్రీలక్ష్మి భూలక్ష్మి సహిత నాభిశిల మరియు ముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.దేవాలయ నిర్మాణ కమిటీ ఆహ్వానం మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో శ్రీ దిండిగాల రాజేందర్ పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయనతో పాటు సుదర్శనం రంగనాథ్, ఎండీ జబ్బార్, ఎస్కే గాజీ, వసంతరావు, రాచపల్లి శ్రీనివాస్, రామ్‌లాల్ పాసి, పరికపెల్లి రవి గౌడ్, మునిగంటి శివ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలను వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. దేవాలయ నిర్మాణానికి సహకరించిన కమిటీ సభ్యులను, కార్యక్రమంలో పాల్గొన్న భక్తులను పలువురు అభినందించారు.

## ఆదివాసి యువతి శిరీష మృతిపై సమగ్ర విచారణ జరపాలి



**తొలి సమయం, ఇల్లందు;ఆగస్టు, 30:**
హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తున్న ఆదివాసి యువతి ఊకే శిరీష మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ డిమాండ్ చేసింది.ఈ మేరకు ఆదివాసి సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం ఇల్లందు కేంద్రంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. సమావేశంలో సంస్థ రాష్ట్ర అధ్యక్షులు, చైర్మన్ పూనెం శ్రీనివాస్ మాట్లాడుతూ.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం చౌటుగూడెం గ్రామానికి చెందిన ఊకే శిరీష జీవనోపాధి కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తూ కుటుంబానికి అండగా నిలిచిందన్నారు. శుక్రవారం రాత్రి ఆమె నివాస గదిలో మృతి చెందినట్లు తెలిపారు. శిరీష మృతిపై పలు అనుమానాలు ఉన్నందున పోలీసులు అన్ని కోణాల్లో సమగ్ర విచారణ చేపట్టి, ఘటనకు కారణమైన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.కార్యక్రమంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి సనప విష్ణు, ఇల్లందు మండల అధ్యక్షులు చింత ఉపేందర్, ఊకే చైతన్య, సనప గోవర్ధన్, కిన్నెర కిషోర్, మీసాల రామచంద్రు, కల్తీ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## కొండపల్లి భారతమ్మ పార్థివ దేహానికి సమ్మిగౌడ్ నివాళులు

**తొలి సమయం; కేసముద్రం/ (మహబూబాబాద్), ఆగస్టు 30:**
కేసముద్రం మున్సిపాలిటీ ఒకటో వార్డు లక్ష్మీ నగర్ కాలనీలో గుండెపోటుతో మృతి చెందిన కొండపల్లి భారతమ్మ పార్థివదేహానికి ప్రముఖ నాయకులు,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్ సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.?ఈ సందర్భంగా ఆయన భారతమ్మ కుమారులు కొండపల్లి వేణుగోపాల్ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి లతో పాటు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి,తన తీవ్ర సానుభూతిని తెలియజేశారు. అనంతరం సమ్మిగౌడ్ మాట్లాడుతూ... భారతమ్మ మరణం ఆ కుటుంబానికి తీరని లోటని, ఆ మహనీయురాలి ఆత్మకు శాంతి చేకూ రాలని ఆ భగవంతుడిని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు, కాలనీవాసులు, బంధుమిత్రులు పాల్గొని నివాళులర్పించారు.





## కేసముద్రంలో కొండచిలువ ప్రత్యక్షం

**తొలి సమయం; కేసముద్రం/ (మహబూబాబాద్), ఆగస్టు 30:**
కేసముద్రం మున్సిపాలిటీ కేంద్రంలోని కిష్టాపురం వీధిలోని పరమేశ్వర్ కిరణం షాప్ ప్రక్క గల్లీలో కొండచిలువ ప్రత్యక్షమైంది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం రాత్రి కేసముద్రం మున్సిపాలిటీ లోని కిష్టాపురం కాలనీలో సుమారు ఆరడుగుల కొండచిలువ ప్రత్యక్షమైందని తెలిపారు.ఎక్కడి నుండి వచ్చిందో కానీ కొద్దిసేపు కనిపించి తర్వాత చెట్ల పొదల్లోకి వెళ్లి మాయమైంది.దీంతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతూ ఉన్నారు.అది ఏ క్షణాన మళ్లీ వస్తుందో అంటూ బిక్కుబిక్కుమంటు గడుపుతున్నారు.వెంటనే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

## పేదలకు సంక్షేమ ఫలాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

### రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీలో సర్పంచ్ నాగ నాయక్



**తొలి సమయం మహబూబాబాద్మరిపెడ ఆగస్టు 30**
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేద, మధ్యతరగతి కుటుంబాలకు సంక్షేమ ఫలాలు అందించేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతోందని వాల్యతండా గ్రామపంచాయతీ సర్పంచ్ నాగ నాయక్ అన్నారు. వాల్యతండా గ్రామపంచాయతీ పరిధిలో సర్పంచ్ నాగ నాయక్ ఆధ్వర్యంలో రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగ నాయక్ మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిలిచిపోయిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందేలా చర్యలు తీసుకుంటోందన్నారు. రేషన్ కార్డుల జారీని నిరంతర ప్రక్రియగా మార్చి, అర్హత కలిగిన పేద కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులను అందిస్తున్నట్లు తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వ రేషన్ సరుకులు మరింత సులభంగా, పారదర్శకంగా అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబం ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలు అందేలా గ్రామపంచాయతీ స్థాయిలో అధికారుల సహకారంతో కృషి చేస్తామని తెలిపారు. అనంతరం సర్పంచ్ నాగ నాయక్ లబ్ధిదారులకు రేషన్ స్మార్ట్ కార్డులను అందజేశారు. దీంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జీపీ సిబ్బంది, అధికారులు, రేషన్ స్మార్ట్ కార్డు లబ్ధిదారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు పెద్దపీట

- 9వ వార్డులో డ్రైనేజీ నిర్మాణానికి శ్రీకారం
- ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం..
- మున్సిపల్ చైర్‌పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి



**తొలి సమయం మహబూబాబాద్/మరిపెడ ఆగస్టు 30**
మహబూబాబాద్ మరిపెడ మున్సిపాలిటీలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తూ ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను చేపడుతున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి అన్నారు. పట్టణంలోని 9వ వార్డు పరిధిలో ప్రజలకు ఎంతోకాలంగా అవసరమైన సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఆదివారం ఆమె ప్రారంభించారు. ప్రజల అవసరాలను గుర్తించి వార్డుల వారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఈ సందర్భంగా తెలిపారు.9వ వార్డులో సైడ్ డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో వర్షాకాలంలో మురుగునీరు రోడ్లపైకి చేరడం, నీరు నిలిచిపోవడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు చైర్‌పర్సన్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యను పరిష్కరించే దిశగా సైడ్ డ్రైనేజీ పనులకు శ్రీకారం చుట్టినట్లు ఆమె తెలిపారు. డ్రైనేజీ నిర్మాణం పూర్తయితే మురుగునీరు సక్రమంగా వెళ్లడంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేందుకు అవకాశం కలుగుతుందన్నారు.పట్టణ ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీలు, పారిశుద్ధ్య వసతులు, వీధి దీపాలు తదితర మౌలిక సదుపాయాలు కల్పించడమే మున్సిపాలిటీ ప్రధాన లక్ష్యమని చైర్‌పర్సన్ పేర్కొన్నారు. ప్రతి వార్డులో స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి ప్రాధాన్యత క్రమంలో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలతో, వేగంగా పూర్తయ్యేలా సంబంధిత సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అభివృద్ధి పనుల సమయంలో సహకరించాలని ఆమె కోరారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. స్థానిక ప్రజల నుంచి వచ్చే సమస్యలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని అవసరమైన చోట మౌలిక వసతులను మెరుగుపరుస్తామని స్పష్టం చేశారు.

### స్థానికుల హర్షం

9వ వార్డులో సైడ్ డ్రైనేజీ పనులు ప్రారంభం కావడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. డ్రైనేజీ సౌకర్యం అందుబాటులోకి రావడంతో వర్షాకాలంలో నీరు నిలిచిపోవడం, మురుగునీటి ఇబ్బందులు తగ్గుతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. తమ సమస్యను గుర్తించి పనులు ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ గుగులోత్ నీలా లచ్చిరాం, కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు పానుగోతు రాంలాల్, 9వ వార్డు అధ్యక్షుడు గంధసిరి సోమన్న, అలువాల ఉపేందర్ ప్రజాపతి, షేక్ అఫ్జల్, గంధసిరి భిక్షపతి, చెన్నూరు మహేష్, కారంపూడి ఉపేందర్, యాకుబ్ జానీ, దూగుంట్ల వెంకన్న, పాషా, కుమార్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం రైతు వేదికలు..!

- జిల్లా అధికారుల స్పందించాలి
- సిపిఐ(ఎం) మండల కార్యదర్శి గుండ గాని మధుసూదన్

**తొలి సమయం మహబూబాబాద్/మరిపెడ ఆగస్టు 30**
వ్యవసాయ శాఖ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం రైతు వేదికలు, రైతు వేదిక శిథిల వ్యవస్థలోకి చేరి, నిరుపయోగానికి గురవుతుండగా అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్య వదిలేయడం బాధాకరమని సిపిఐ(ఎం) మండల కార్యదర్శి గుండ గాని మధుసూదన్ అన్నారు. ఆదివారం అబ్బాయిపాలెం గ్రామ శివారు పత్తికుంటతండా నిర్మించిన రైతు వేదికను వారు సందర్శించారు. ఈ తండ పక్కన ఉన్న రైతు వేదికను పరిశీలించారు. అక్కడ రైతులు తెలిపిన ఆధారంగా అబ్బాయిపాలెం, అమ్మ నాయక్ తండ, ధారావత్ తండా, గాలి వారి గూడెం గ్రామపంచాయతీలతో పాటు, మరిపెడ మున్సిపాలిటీకి చెందిన సుమారు 5000 మంది రైతులకు ఉపయోగపడే మరిపెడ క్లస్టర్ రైతు వేదిక అబ్బాయి పాలెం లో నిర్మాణం చేపట్టారు. దీనిని గత బిఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో సుమారు 23 లక్షలు ఖర్చు చేసి నాసిరకంగా నిర్మించి చేతులు దులుపుకున్నారు. అవినీతి అక్రమాలకు అధికారుల నిర్లక్ష్యానికి



రైతు వేదికలుగా నిలిచాయని మధు ఆరోపించారు. గత రెండు సంవత్సరాల క్రితం కురిసిన భారీ వర్షాలకు సందర్భంగా చెరువు అలుగు వరద తాకిడికి రైతు వేదిక బయట ప్రాంతంలో పాక్షికంగా దంసమైందన్నారు. గతంలో రెండు మూడు దఫాలుగా మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకుపోయిన కనీసం వారు పట్టించుకోలేదని మధు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు కళ్ళు తెరిచి దీని మైనరు రిపేరు చేసి రైతులకు



ఉపయోగపడే విధంగా చూడాలని ఆయన అధికారులను కోరారు. లేనియెడల సంబంధిత అధికారులపై చర్యలు తీసుకునే విధంగా రైతులను సమీకరించి ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) మండల నాయకులు బాణాల రాజన్న, గ్రామ శాఖ కార్యదర్శి కొండ ఉప్పలయ్య, నాయకులు ఎర్ర వెంకన్న, సైదులు, స్థానిక రైతులు తదితరులు ఉన్నారు.

# అక్రమంగా తరలిస్తున్న 40 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

**తొలి సమయం, టేకులపల్లి: ఆగస్టు, 30:**
అక్రమంగా తరలిస్తున్న సుమారు 40 క్వింటాళ్ల ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యాన్ని టేకులపల్లి పోలీసులు పట్టుకున్నారు. బియ్యంతో పాటు అశోక్ లేలాండ్ బడా దోస్త్ వాహనాన్ని సీజ్ చేసి, ఐదుగురిపై కేసు నమోదు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు, డీఎస్పీ యు. వెంకన్నబాబు సూచనలతో సీఐ బి. సత్యనారాయణ పర్యవేక్షణలో ఆదివారం ఉదయం టేకులపల్లిలోని భారత్ పెట్రోల్ బంక్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా కనిపించిన అశోక్ లేలాండ్ వాహనాన్ని తనిఖీ చేయగా పీడీఎస్ బియ్యం బయటపడింది. విచారణలో టేకులపల్లి మండల పరిసర గ్రామాల నుంచి తక్కువ ధరకు పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. సుమారు 40 క్వింటాళ్ల బియ్యాన్ని వాహనంలో కాకినాడకు తరలిస్తున్నట్లు తెలిపారు. పట్టుబడిన బియ్యం విలువ సుమారు రూ.1,01,250గా పోలీసులు అంచనా వేశారు.పీడీఎస్



బియ్యంతో పాటు వాహనాన్ని సీజ్ చేసి, నిందితులను అదుపులోకి



తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

# మహబూబాబాద్ యువతకు పోలీస్ ఉద్యోగాల కోసం ఉచిత శిక్షణ గొప్ప అవకాశం

### జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో ఉచిత కానిస్టేబుల్ , ఎస్ఐ కోచింగ్ శిబిరం ప్రారంభం

**తొలి సమయం మహబూబాబాద్ ఆగస్టు 30**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పోలీస్ నియామకాలకు సిద్ధమవుతున్న ఎన్జిల్లా యువతీ యువకులకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత పోలీస్ కానిస్టేబుల్ ఒ ఎస్ఐ కోచింగ్ శిబిరం ఘనంగా ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన గౌరవ రాజ్యసభ సభ్యులు శ్రీ వేమ్ నరేందర్ రెడ్డి, శిక్షణ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ, పోలీస్ ఉద్యోగాల్లో అవకాశాలను అందిపుచ్చుకునేందుకు మహబూబాబాద్ జిల్లా యువతకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎంతో చక్కటి ఉచిత కోచింగ్ అందించడం అభినందనీయమని అన్నారు. బద్రాద్రి జోన్ పరిధిలో కేటాయించిన పోలీస్ ఉద్యోగాల ఖాళీల్లో మహబూబాబాద్ జిల్లాకు ఉన్న పోస్టులను లక్ష్యంగా చేసుకుని అభ్యర్థులు కష్టపడి సిద్ధం కావాలని సూచించారు జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ సంకల్పంతో ప్రారంభించిన ఈ ఉచిత కోచింగ్ కార్యక్రమం అభ్యర్థులకు ఎంతో గొప్ప అవకాశమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యువతకు అండగా ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ నిరుత్సాహపడకుండా కష్టపడి, అవసరమైతే నిద్రలేని రాత్రులు గడుపుతూ లక్ష్యసాధన కోసం సిద్ధమై ఉద్యోగాలు సాధించాలని పిలుపునిచ్చారు. భాగ్యకిరణ్ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ ద్వారా శిక్షణ పొంది తమలోని ప్రతిభను వెలికితీసుకుని ఉద్యోగాలు



సాధించాలని సూచించారు. ప్రతి ఒక్కరిలో ఉన్న నైపుణ్యాన్ని, ప్రతిభను బయటకు తీసుకురావడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందని అన్నారు. ప్రతిభ ఉన్న అభ్యర్థులను గుర్తించి వారికి సరైన శిక్షణ అందిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోనే మహబూబాబాద్ జిల్లా నుంచి అత్యధిక సంఖ్యలో యువత పోలీస్ ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలోని యువతకు మంచి సందేశం వెళ్లాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ విద్య, ఉద్యోగ అవకాశాలపై దృష్టి సారించాలని సూచించారు. యువతకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలు, అవకాశాలు కల్పించేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం, ప్రజాప్రతినిధులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని తెలిపారు. సందర్భంగా జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ ఉచిత శిక్షణ శిబిరం ఎంతో మంచి అవకాశమని అన్నారు. పోలీస్ రిక్రూట్‌మెంట్‌కు సిద్ధమవుతున్న అభ్యర్థులకు నాణ్యమైన శిక్షణ అందించాలనే ఉద్దేశంతో ముందుగా 1,056 మంది అభ్యర్థులను స్క్రీనింగ్ టెస్ట్‌కు ఎంపిక చేసి, అందులో 500 మంది అభ్యర్థులను ఉచిత శిక్షణకు ఎంపిక చేసినట్లు తెలిపారు.వీరికి రెండు నెలల పాటు ప్రత్యేక ఉచిత శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన భాగ్యకిరణ్ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీతో ఉత్తమ స్థాయి శిక్షణ అందించనున్నట్లు వెల్లడించారు.అభ్యర్థులకు శిక్షణతో పాటు ఉచిత స్టడీ మెటీరియల్, భోజన సదుపాయాలను కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ముఖ్య అతిథి శ్రీ వేమ్ నరేందర్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు, మహబూబాబాద్ ఎంపీ శ్రీ బలరాం నాయక్, ఎమ్మెల్యే శ్రీ మురళి నాయక్, చైర్‌పర్సన్ శ్రీమతి జ్యోతి, జిల్లా కలెక్టర్ స్నేహా శబరీష్ఐఏఎస్,జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ తదితరుల చేతుల మీదుగా ఉచిత శిక్షణకు ఎంపికైన అభ్యర్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో భాగ్యకిరణ్ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్ అధినేత భాగ్యకిరణ్, అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, పోలీస్ అధికారులు, పోలీస్ సిబ్బంది, శిక్షణకు ఎంపికైన 500 మంది అభ్యర్థులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పార్టీ కార్యకర్తకు అండగా వేం నరేందర్ రెడ్డి

- వారి భవిష్యత్తుపై భరోసా
- తక్షణ సహాయంగా పదివేల రూపాయల అందజేత

**తొలి సమయం; కేసముద్రం/ (మహబూబాబాద్),ఆగస్టు 30:**
రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి ఉప్పరపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్త పలుస రాజు సతీమణి ఇటీవల గుండెపోటుతో అకాల మరణం చెందిగా వారి కుటుంబానికి అండగా నిలిచారు.ఈ సందర్భంగా వేం నరేందర్ రెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించారు.పలుస రాజుకు ఇద్దరు పిల్లలు ఉండగా వారి విద్య గురించి అడిగి తెలుసుకున్నారు. కష్టపడి చదవాలని పిల్లలకు సూచించారు.వారి భవిష్యత్తుపై భరోసా కల్పించారు.తక్షణ సహాయంగా 10,000 రూపాయలను అందజేశారు. అలాగే అదే గ్రామానికి చెందిన ఇటీవల మరణించిన రిటైర్డ్ ఉపాధ్యాయులు సంకు వెంకటాద్రి సతీమణి సంకు సుగుణమ్మ మరణించగా వారి కుటుంబ సభ్యులు అయిన



సంకు శ్రీనివాసరెడ్డి, శ్రీపాల్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి లను పరామర్శించారు.వారి కుటుంబానికి మనోధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బలరాం నాయక్, ఏఎంసీ చైర్మన్ గంట సంజీవరెడ్డి, అల్లం నాగేశ్వరావు,రావుల మురళి, బండారు దయాకర్,నూకల వెంకటేశ్వర్లు ,కోమాకుల రమేష్, సత్యనారాయణ, సారంగం, సంపత్,విక్రమ్, పరిపూర్ణాచారి, రాజు, రాములు ,ప్రవీణ్,సందీప్,షబ్బీర్ పాల్గొన్నారు.

# కింగ్ 100 గ్లింప్స్ విడుదల.. పవర్ ఫుల్ డైలాగ్‌తో హీరో పరిచయం




అక్కినేని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న నాగార్జున కెరీర్‌లోని ప్రతిష్టాత్మక 100వ సినిమా సందడి మొదలైంది. 'కింగ్ 100'గా ప్రచారంలో ఉన్న ఈ ల్యాండ్‌మార్క్ ప్రాజెక్ట్‌కు సంబంధించిన టైటిల్‌ని గ్లింప్స్ ద్వారా రివీల్ చేశారు. సినిమా టైటిల్‌ని 'కింగ్ 100' అని పెట్టడం గమనార్హం. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్ పై అక్కినేని ఫ్యామిలీ నిర్మాణంలో తమిళ దర్శకుడు రా కార్తీక్ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతుంది. నేడు నాగార్జున పుట్టిన రోజు కావడంతో ఈ సినిమా ఫస్ట్ గ్లింప్స్ ని రిలీజ్ చేసారు. మనుషుల్లో రెండు రకాలు.. ఒకటి డబ్బున్న వాళ్లు, మరొకటి డబ్బు లేని వాళ్లు అనే పవర్ ఫుల్ డైలాగ్‌తో నాగార్జునని పరిచయం చేశారు. గ్లింప్స్ చూస్తుంటే డబ్బు లేని ఓ పేదవాడు కసిగా ఎదిగి, మోసాలు చేస్తూ బాగా సంపాదించి కింగ్ స్థాయికి ఎలా ఎదిగాడు అనేది చిత్రంలో చాలా ఇంట్రెస్టింగ్‌గా చూపించనున్నట్టు అర్థమవుతుంది. మరోవైపు చిత్రంలో ఫాదర్ ఎమోషన్ కూడా ఉండబోతుంది అని, నాగార్జున ఇందులో ఫ్లాష్ బ్యాక్ లో యంగ్ వర్షన్ లో కూడా కనిపించబోతున్నట్టు అర్థమవుతుంది. చిన్న గ్లింప్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో ఆసక్తిని రేపుతోంది. కేవలం కొద్ది సెకన్ల వీడియోతోనే చిత్రంపై భారీ హైప్‌ను క్రియేట్ చేయడంలో మేకర్స్ సక్సెస్ అయ్యారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లో మరో ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్న అంశం టబు ఎంట్రీ. గతంలో నాగార్జున, టబు కలిసి నటించిన 'నిన్నే పెళ్లాడుతా', 'ఆవిడా మా ఆవిడే' వంటి సినిమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. చాలా ఏళ్ల తర్వాత ఈ హిట్ జోడీ మళ్లీ ఒకే సినిమాలో కనిపించబోతుండటంతో అభిమానుల్లో ప్రత్యేకమైన ఆసక్తి నెలకొంది. ఈ సినిమాలో టబు పాత్ర చాలా కీలకంగా ఉంటుందని, కథను మలుపు తిప్పే పవర్‌ఫుల్ క్యారెక్టర్‌లో ఆమె కనిపించనున్నారని సమాచారం. దీంతో నాగ్-టబు కాంబినేషన్‌పై అంచనాలు భారీగా పెరిగాయి. 'నితమ్ ఒరు వానమ్' చిత్రంతో దర్శకుడిగా తనదైన గుర్తింపు తెచ్చుకున్న రా కార్తీక్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. భావోద్వేగాలకు, కమర్షియల్ ఎలిమెంట్స్‌కు సమాన ప్రాధాన్యం ఇస్తూ నాగార్జున 100వ సినిమాను ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలుస్తోంది. గ్లింప్స్‌ను బట్టి చూస్తే, దర్శకుడు ఈసారి ఫీల్‌గుడ్ కథకు భిన్నంగా మిస్టరీ, యాక్షన్ అంశాలతో కూడిన కథను ఎంచుకున్నట్లు అంచనా వేస్తున్నారు. ఈ భారీ ప్రాజెక్ట్‌కు రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఈ మూవీని డిసెంబర్ 24న విడుదల చేయనున్నట్టు గ్లింప్స్ తో తెలియజేశారు.

## ఓటీటీలోకి మలయాళ క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్.. ఇదేం ట్విస్టులు సామి!



ప్రేక్షకులందు సినిమా ప్రేక్షకులు వేరయా...అది ఆటైనా, పాటైనా ...వేడుకేదైనా, వేదికేదైనా ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా కార్యక్రమం రూపుదిద్దుకుంటే మాత్రం చాలు ఆ కార్యక్రమం విజయవంతమైనట్లే. కాని సినిమా ప్రేక్షకులు మాత్రం వీటన్నిటికీ విభిన్నం. విషయాన్ని సూటిగా చెబితే సినీ ప్రేక్షకులు అలరించరు. అదే విషయానికి కాస్త మసాలా దట్టించి చెప్పాలనుకున్న విషయాన్ని వినూత్నంగా చివరాఖరిలో చెబితేనే సినిమా అలరిస్తుంది. మరీ ముఖ్యంగా ఇప్పటితరం వైవిధ్యానికి పెద్ద పీట వేస్తోంది.ఆ నేపథ్యంలో వచ్చిన సినిమా ఉయిర్. ప్రముఖ ఓటీటీ సంస్థ జియోహాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. ఇదో క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్. ఇది మళయాళ సినిమా అయినా హాట్ స్టార్ లో తెలుగులోనూ లభ్యమవుతోంది. ప్రముఖ మళయాళ రచయితలు షాజీ, నిఖిల్ రాసిన కథకు పద్మకుమార్ ప్రాణం పోసిన సినిమానే ఉయిర్. ఈ సినిమా ప్రారంభం నుండి శుభం కార్డు వరకు ప్రేక్షకుడిలో ఆమితాసక్తిని రేకెత్తిస్తూ ఆఖరి సన్నివేశం వరకూ ఉత్కంఠ రేపుతుంది. అంతలా ఈ సినిమా కథలో ఏముందో ఓ సారి చూద్దాం. కేరళలోని కన్నూర్ సమీప ప్రాంతంలో ఉన్న ఓ పాడుబడిన బావిలో కుళ్ళిపోయిన స్థితిలో ఒక గుర్తుతెలియని మహిళ మృతదేహం బయటపడటంతో కథ ప్రారంభమవుతుంది. కొత్తగా విధుల్లో చేరిన సబ్‌ఇన్‌స్పెక్టర్ అజీబ్‌కు ఈ కేసు దర్యాప్తు బాధ్యత అప్పగిస్తారు. సీనియర్ పోలీస్ ఆఫీసర్ జాయ్ పర్యవేక్షణలో అజీబ్ తన మొదటి పెద్ద కేసుగా దీన్ని తీసుకుంటాడు. ప్రారంభంలో ఎలాంటి క్లూస్ దొరకకపోయినా, ఆ శవం వేసుకోనున్న బట్టలు, చేతి గాజుల ఆధారంగా ఆ మహిళ కర్ణాటక సరిహద్దు ప్రాంతం నుంచి వచ్చిన వలస కార్మికురాలు 'శోభ' అని గుర్తిస్తారు.విచారణ ముందుకెళ్ళేకొద్దీ ఇది సాధారణ హత్య కాదని దీని వెనుక పెద్ద మోసపూరిత కుట్ర దాగుందని అజీబ్ కు అర్థమవుతుంది. శోభ హత్య సమయంలో తప్పిపోయిన శోభ పిల్లల గురించి అజీబ్ ఆరా తీస్తుంటాడు. మరో వైపు అజీబ్‌కు చిన్నతనంలోనే తన సొంత చెల్లెలు తప్పిపోయిన చేదు జ్ఞాపకం నిరంతరం వెంటాడుతూ ఉంటుంది. దానికి ఈ హత్యకు ఓ లింకు కూడా ఉంటుంది. మరి శోభను హత్య చేసిన అసలు నేరస్థుడిని అలాగే శోభ పిల్లలను అజీబ్ వెతికి పట్టుకుంటాడా లేదా అన్నది మాత్రం ఉయిర్ సినిమాలోనే చూడాలి. ఈ సినిమా స్క్రీన్ ప్లే మాత్రం ఊహకందని రీతిలో పరిగెడుతుంది. మస్ట్ వాచ్ థ్రిల్లర్ ఫర్ ది వీకెండ్.



## ఆగని 'ఇరుముడి' జోరు.. ఇప్పటివరకు కలెక్షన్స్ ఎంతంటే?

చీకటి తర్వాత వెలుగు రావడం ఎంత సహజమో.. వరుస పరాజయాల తర్వాత ఓ విజయం పలకరించడం కూడా అంతే సహజమని మరోసారి నిరూపించాడు మాస్ మహారాజా రవితేజ. వరుస ఫ్లాపులతో సతమతమవుతున్న ఈ హీరోకు ఎట్టకేలకు 'ఇరుముడి'తో హిట్ దొరికింది. అది కూడా మాములు హిట్ కాదు.. బ్లాక్ బస్టర్.సినిమా రిలీజై వారం రోజులు గడిచినా ఇప్పటికే ప్రేక్షకులు ఈ సినిమా కోసం థియేటర్స్‌కి పోటెత్తున్నారు. దీంతో కలెక్షన్స్ కూడా భారీగా పెరిగిపోతున్నాయి. సినిమా రిలీజ్ అయిన నాలుగు రోజుల్లో ఏకంగా రూ. 100 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ రాబట్టింది. ఇక ఇప్పుడు రూ.150 కోట్ల క్లబ్‌లో చేరింది. ఇప్పటి వరకు ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా రూ. 150 కోట్లు వసూలు చేసినట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు.

**అప్పుడెప్పుడో రూ. 100 కోట్లు..**

రవితేజ ఖాతాలో రూ. 100 కోట్ల వసూళ్ల సినిమా పడి చాలా కాలమైంది. 2022లో వచ్చిన ధమాకా ఒక్కటే సెంచరీ కొట్టింది. ఆ తర్వాత చేసిన సినిమాలన్నీ బాక్సాఫీస్ వద్ద దారుణంగా బోల్తా పడ్డాయి. ఈ నాలుగేళ్లలో ఆయన 6 సినిమాలు చేస్తే.. వాటిలో ఏ ఒక్కటి కూడా హిట్ టాక్‌ని సంపాదించుకోలేదు. కొన్ని సినిమాలు అయితే కనీసం రూ. 10 కోట్ల వసూళ్లను రాబట్టలేదు. చాలా కాలం తర్వాత ఇప్పుడు ఇరుముడితో హిట్ కొట్టి.. పాత లెక్కలన్నీ సరిచేశాడు. మరి ఇకపై ఈ మాస్ మహారాజ సినీ జర్నీ ఎలా ఉంటుందో చూడాలి.



## వెంకీ-త్రివిక్రమ్ 'ఆదర్శ కుటుంబం'లో అదిరిపోయే సర్‌ప్రైజ్.. ఆ పాటని రీమిక్స్!

విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆదర్శ కుటుంబం' పై భారీ అంచనాలు నెలకొన్నాయి. చాలా కాలం తర్వాత ఈ ఇద్దరూ కలిసి చేస్తున్న సినిమా కావడంతో వెంకీ అభిమానులతో పాటు సినీ ప్రేక్షకులు కూడా ఈ ప్రాజెక్ట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే ముందుగా అనుకున్న సమయానికి విడుదల కావాల్సిన ఈ చిత్రం కొన్ని అనుకోని కారణాల వల్ల వాయిదా పడింది. ప్రస్తుతం మేకర్స్ సినిమాను అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే, తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఒక ఆసక్తికరమైన అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వెంకటేష్ కెరీర్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న 'కూలీ నెం.1' చిత్రంలోని సూపర్ హిట్ పాట 'దండాలయ్య ఉండ్రాలయ్య'ను 'ఆదర్శ కుటుంబం' కోసం కొత్తగా రీమిక్స్ చేస్తున్నట్లు సమాచారం. 'కూలీ నెం. 1' సినిమాలో వెంకటేష్‌పై చిత్రీకరించిన 'దండాలయ్య ఉండ్రాలయ్య' పాట ఇప్పటికీ ప్రేక్షకుల మదిలో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. ముఖ్యంగా వినాయక చవితి సమయంలో గణేష్ మండపాల వద్ద ఈ పాట వినిపిస్తూనే ఉంటుంది. తరతరాలుగా ప్రేక్షకులను అలరిస్తున్న ఈ పాటకు ఇప్పటికీ ఉన్న క్రేజ్ ఏమాత్రం తగ్గలేదు. ఇప్పుడు అదే చార్ట్‌బస్టర్ పాటను 'ఆదర్శ కుటుంబం' కోసం రీమిక్స్ చేయనున్నారనే వార్త అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. త్రివిక్రమ్ తనదైన శైలిలో ఈ పాటను ఎలా ప్రెజెంట్ చేస్తారు? అసలు కథలో ఈ పాటను ఏ సందర్భంలో ఉపయోగించబోతున్నారు? అనే అంశాలపై ఇప్పుడు చర్చ జరుగుతోంది. పాత పాటలోని మ్యాజిక్‌ను అలాగే ఉంచుతూ, కొత్త తరం ప్రేక్షకులను ఆకట్టుకునేలా సరికొత్త మ్యూజిక్, గ్రాండ్ విజువల్స్‌తో ఈ రీమిక్స్‌ను రూపొందించే అవకాశం ఉందని టాక్. ముఖ్యంగా వెంకటేష్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లో ఈ సాంగ్ వస్తే థియేటర్లలో మంచి సందడి నెలకొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ చిత్రంలో వెంకటేష్ సరసన అందాల భామ శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తున్నారు. వెంకటేష్‌తో ఆమె కాంబినేషన్ ప్రేక్షకులకు కొత్తగా ఉండబోతోంది. ఇప్పటికే పలు చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న శ్రీనిధి.. ఈ సినిమాలో కీలకమైన పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. వెంకటేష్ మార్క్ కామెడీ, ఫ్యామిలీ ఎమోషన్స్‌కు శ్రీనిధి పాత్ర ఎలా తోడ్పడుతుందనేది ఆసక్తికరంగా మారింది.

## కీర్తి సురేష్‌తో కలిసి నాని మాస్ స్టెప్పులు

### 'యెష నాగుల కట్ట మీద' లిరికల్ వీడియో సాంగ్ రిలీజ్




నేచురల్ స్టార్ నాని, టాలెంటెడ్ డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా మూవీ 'ది ప్యారడైజ్' నుంచి మేకర్స్ మరో అదిరిపోయే మాస్ అప్‌డేట్ ఇచ్చారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి "యెష నాగుల కట్ట మీద.. యేసె ఉయ్యాల" సాంగ్‌ను విడుదల చేసిన చిత్రయూనిట్ తాజాగా లిరికల్ వీడియోను వదిలింది. పూర్తి లిరికల్ వీడియో సాంగ్ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అచ్చమైన తెలంగాణ జానపద బాణీలో సాగే ఈ పాటలో కీర్తి సురేష్ స్పెషల్ అప్పీరెన్స్ ఇచ్చి నానితో కలిసి ఊరమాస్ స్టెప్పులతో అదరగొట్టారు. కాసర్ల శ్యామ్ అందించిన సాహిత్యం ఈ పాటకు మరింత ఊపునివ్వగా, జంగి రెడ్డి, ప్రభా తమ శక్తివంతమైన గొంతుతో పాడి ప్రాణం పోశారు. ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి రూ.200 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రంపై ఈ సాంగ్ ద్వారా అంచనాలు మరింత తారాస్థాయికి చేరాయి. సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా పలు భాషల్లో ఈ సినిమా గ్రాండ్‌గా విడుదల కానుంది.

PUBLICATIONS AND PRINTERING BY VEMULA AYODHYA RAMULU, H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST: MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506101, TELTEL NO 12283, PHONE NUMBER 9000689544...